కాంగ్రెస్‌తో హైదర్‌బాద్

4 దశాబ్దాల పాలనంతా కర్ఫ్యూలే

2,703 ఘటనలతో నెత్తురోడిన నగరం • ఏమరపాటుతో ఓటేస్తే అశాంతి, అల్లర్లు
లుంబినీ, గోకుల్ చాట్, మక్కా మసీద్‌లో పేలుళ్లు • శాంతిభద్రతల్లో నాటి కాంగ్రెస్ సర్కారు విఫలం
ఇతర రాష్ట్రాల్లోనూ హస్తం పార్టీ ప్రభుత్వాలు ఫ్లాప్ • నేరాలకు అడ్డాగా మారిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు
తెలంగాణలో మళ్లీ పాగాకు కాంగ్రెస్ నేతల కుట్రలు • ఆదమరిచి ఓటేస్తే, మళ్లీ హైదరాబాద్‌లో కల్లోలమే
భద్రత లేకపోతే పెట్టుబడులకు కంపెనీలు వెనుకంజ • అభివృద్ధి పడకేస్తే దివాలా దిశగా తెలంగాణ?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌ను హైదరా'బ్యాడ్'గా పత్రికలు పతాక శీర్షికల్లో అభివర్ణించేవి. హైదరాబాద్ అంటేనే కర్ఫ్యూలకు చిరునామాగా పేర్కొనేవి. దశాబ్దాలపాటు ఏటా నగరంలో ఎక్కడో ఓ చోట, ఏదో ఓ సందర్భంలో బంద్‌లు జరిగేవి. మత సామరస్యానికి ప్రతీకగా చెప్పుకొనే భాగ్యనగరిలో తరచూ మత ఘర్షణలు చోటుచేసుకొనేవి. వీటికితోడు హత్యలు, మారణకాండలు, దోపిడీలు, ఉగ్రదాడులు, దొమ్మీలకు అంతేలేదు. స్వార్థపూరిత రాజకీయాలు, అసాంఘిక శక్తులను పెంచిపోషించడం, ప్రజా భద్రతమీద చిత్తశుద్ధిలేనితనం, విధాన పరమైన వైఫల్యాలు వెరసి కాంగ్రెస్‌పాలనలో తెలంగాణప్రజానీకం అభద్రతలో మగ్గిపోయింది.1978 నుంచి 2014 వరకు (మూడేండ్లు మినహా) మతకలహాలు, బాంబు పేలుళ్లతో హైదరాబాద్ నగరం అట్టుడికిపోయింది. 44 ఏండ్లకాంగ్రెస్ పాలనలో నగరంలో మొత్తంగా 2,703 అల్లర్లు జరిగాయి. ఈ ఘటనల్లో 554 మంది ప్రాణాలు కోల్పోయారు. 4,798 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీటికితోడు ఉగ్రవాదుల బాంబు దాడులు, పేలుళ్లతో హైదరాబాద్‌లో పరిస్థితులు మరింతగా దిగజారాయి. నిఘా వైఫల్యం, సర్కారు ఉదాసీన వైఖరి కారణంగానే లుంబినీ పార్కు, గోకుల్ చాట్, మక్కా మసీద్ వద్ద పేలుళ్లు జరిగినట్టు నివేదికలు తూర్పారబట్టాయి. దీంతో భాగ్యనగరంలో అభివృద్ధి, కంపెనీల రాక అంతంత మాత్రంగానే ఉండేది. బెంగళూరు తదితర నగరాలకు పెట్టుబడులు తరలిపోయేవి.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైతది?

- కాంగ్రెస్ అంటేనే అంతర్గత కుమ్ములాటలు, స్వార్థ రాజకీయాలు, అస్థిరత.
- గతంలోలాగే శాంతి, భద్రతలపై కాంగ్రెస్ ఉదాసీనంగా వ్యవహరిస్తది. ప్రజాక్షేమం గాలికొదిలేస్తది.
- ఫలితంగా.. మతఘర్షణలు, అల్లర్లు, కర్ఫ్యూలు, ఉగ్రదాడులతో నగరమంతా అల్లకల్లోలంగా మారుతది.
- రక్షణ లేని హైదరాబాద్ నుంచి పెట్టుబడులు వేరే ప్రాంతానికి తరలిపోతాయి. యువతకు ఉద్యోగాలు ఉండవ్.
- భద్రతలేని నగరంలో ఎవరూ ఉండరు. వలసలు ఘరూ. భూముల రేట్లు పడిపోతాయి. దివాలా దిశగా తెలంగాణ.

గ్రేటెస్ట్ పోలీస్ ఆఫ్ ఇండియా.. తెలంగాణ పోలీస్

శాంతి-భద్రతలు అదుపులో ఉన్నప్పుడే సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించగలదు. తెలంగాణ ఏర్పాటైతే తీవ్రవాదులు వచ్చేస్తారని, శాంతిభద్రతలు గతి తప్పుతాయని చాలామంది విష ప్రచారాలు చేశారు. కానీ, వాటన్నింటినీ పటాపంచలు చేసిన ఘనత తెలంగాణ పోలీసులకు దక్కుతుంది. నేను ఢిల్లీకి వెళ్లినప్పుడు అక్కడి ప్రజాప్రతినిధులు 'యంగెస్ట్ స్టేట్ ఆఫ్ ఇండియా.. గ్రేటెస్ట్ పోలీస్ ఆఫ్ ఇండియా' అని మనవాళ్లను ప్రశంసించినప్పుడు ఎంతో సంతోషం కలిగింది. - సీఎం కేసీఆర్

శాంతి-భద్రతలు పటిష్టంగా..

గత పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో శాంతి, సుస్థిరతలకు చిరునామాగా హైదరాబాద్ నిలిచింది. జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్సీఆర్‌బీ)-2022 నివేదిక తెలంగాణ రాజధానిని సేఫెస్ట్ సిటీగా అభివర్ణించింది. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఏటా 10 లక్షల జనాభాకు సగటున నమోదవుతున్న నేరాల ఆధారంగా ఎన్సీఆర్బీ ఈ నివేదికను విడుదల చేసింది. ఇందులో అత్యంత తక్కువ కేసులు నమోదవుతున్న నగరాల్లో హైదరాబాద్ నిలిచింది. తక్కువ కేసులు నమోదవుతున్న నగరాల జాబితాలో భాగ్యనగరం దక్షిణ భారత్‌లోనే మొదటి స్థానంలో, దేశంలో మూడో స్థానంలో నిలిచింది. నగరంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండటంతో పెట్టుబడులు హైదరాబాద్‌కు తరలివచ్చాయి. కంపెనీలు నగరానికి క్యూకట్టాయి. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వలసలు పెరిగాయి. భూముల విలువ బంగారమైంది.

కల్లోలం మళ్లీ దాపురిస్తే, ఏమైతది?

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రశాంతతకు చిరునామాగా నిలిచింది. అయితే, ఈ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశమివ్వాలని కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారు. ఒకవేళ అదే జరిగితే, నాలుగు దశాబ్దాల పాత గాయాలు మళ్లీ పునరావృతం అవుతాయి. నిబ్బరంగా ఉన్న నగరం భయం నీడలోకి జారిపోతుంది. మత ఘర్షణలు, కర్ఫ్యూలు రాజ్యమేలుతాయి. అల్లర్లతో ఆస్తి, ప్రాణ నష్టం పెద్దఎత్తున సంభవిస్తుంది. భద్రత కరువైన నగరానికి పెట్టుబడులు రానేరావు. హైదరాబాద్ అభివృద్ధికి దూరమై అధఃపాతాళానికి వెళ్తుంది. నగరంలో కొలువుదీరిన గ్లోబల్ కంపెనీలు ఇతర మెట్రో నగరాలకు తరలివెళ్తాయి. ఫలితంగా లక్షలాది మంది ఉద్యోగాలు పోతాయి. ఉపాధిలేని నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పెరుగుతాయి. జనావాసాలు తగ్గిపోవడంతో కోట్లు విలువ చేస్తున్న భూముల ధరలు అమాంతం పడిపోతాయి. వ్యాపారాలు దెబ్బతింటాయి. దీంతో తెలంగాణకు ఆర్థిక చోదక శక్తిలా ఉన్న హైదరాబాద్ పూర్తిగా దెబ్బతింటుంది. ఫలితంగా రాష్ట్రం దివాలా తీసే దుస్థితి దాపురించవచ్చు.

నేరాలకు అడ్డాగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు

సమైక్య రాష్ట్రంలోనే కాదు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, యూపీఏ కూటమి పాలనాపగ్గాలు చేపడుతున్న బీహార్, తమిళనాడులో కూడా నేరాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. క్రైమ్‌రేట్ అధికంగా ఉన్న రాష్ట్రాల టాప్-8 జాబితాలో మూడు రాష్ట్రాలు యూపీఏపాలితాలే. అంతేకాదు.. నేరాలు ఎక్కువగా జరిగే నగరాల్లో కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లోని జైపూర్, బెంగళూరు, చెన్నై, పాట్నా, కోయంబత్తూర్ వంటి నగరాలు ఉన్నాయి.

సేఫెస్ట్ సిటీ ఆఫ్ ఇండియా-హైదరాబాద్

■ నగరం ■ నేరాల సంఖ్య

ఢిల్లీ: 18,596	సూరత్ (గుజరాత్-బీజేపీ): 16,768	కొచ్చి (కేరళ): 16,022	అహ్మదాబాద్ (గుజరాత్-బీజేపీ): 15,190
చెన్నై (తమిళ నాడు-యూపీఏ): 13,247	ఇండోర్ (మధ్యప్రదేశ్-బీజేపీ): 11,071	జైపూర్ (రాజస్థాన్-కాంగ్రెస్): 10,269	
నాగపూర్ (మహారాష్ట్ర-ఎన్డీయే): 8,921	పాట్నా (బీహార్-యూపీఏ): 8,721	ఘజియాబాద్ (యూపీ-బీజేపీ): 6,989	
కోయంబత్తూర్ (తమిళ నాడు-యూపీఏ): 6,494	లక్నో (యూపీ-బీజేపీ): 5,909	కోజికోడ్ (కేరళ): 5,158	ముంబై (మహారాష్ట్ర-ఎన్డీయే): 4,285
బెంగళూరు (కర్ణాటక-కాంగ్రెస్): 4,272	కాన్పూర్ (యూపీ-బీజేపీ): 3,365	హైదరాబాద్ 2,599	(ఆధారం: ఎన్సీఆర్బీ-2022 నివేదిక)

నేరాలు ఎక్కువగా జరిగే రాష్ట్రాలు

■ రాష్ట్రం ■ నేరాలు (ప్రతి లక్ష జనాభాకు)

ఉత్తరప్రదేశ్ (బీజేపీ): 112.7	మహారాష్ట్ర (బీజేపీ): 88.4	బీహార్ (యూపీఏ): 86.9	తమిళ నాడు (యూపీఏ): 85.8	మధ్యప్రదేశ్ (బీజేపీ): 84.5	రాజస్థాన్ (కాంగ్రెస్): 83.6	అస్సాం (ఎన్డీయే): 82.4	గుజరాత్ (బీజేపీ): 81.3

శాంతిభద్రతల వల్లే ఉపాధి

శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్న చోటే ఉపాధిరంగం విలసిల్లుతుంది. అందుకే హైదరాబాద్‌లో భద్రతను పటిష్టం చేశాం. ఏ చిన్న ఘటన జరిగినా క్షణాల్లో స్పందించే సాంకేతిక సదుపాయాలను పోలీసు శాఖకు అనుసంధానం చేశాం. - మంత్రి కేటీఆర్

అప్పుడు కల్లోలం-ఇప్పుడు ప్రశాంతం

మత ఘర్షణలు

2014 కు ముందు: మత ఘర్షణలతో హైదరాబాద్ తరుచూ ఉలిక్కిపడేది. గడిచిన 44 ఏండ్లలో 2,703 అల్లర్లు జరిగాయి. 554 మంది ప్రాణాలు కోల్పోయారు. 4,798 మంది గాయపడ్డారు.

2014 తర్వాత: సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు. ఫలితంగా గడిచిన పదేండ్లలో మత కలహాలన్న ముచ్చటే లేకుండా పోయింది.

చైన్ స్నాచింగ్స్

2014 కు ముందు: మహిళలు ఒంటరిగా రోడ్లమీదకు రావాలంటేనే భయపడే దుస్థితి. రోజూ 20దాకా చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండేవి. ఏడాదికి 7,500 వరకు చైన్ స్నాచింగ్ ఘటనలు జరుగుతుండేవి. నిఘా కోసం అవసరమైన సీసీ కెమెరాల సంఖ్య 350కు మించి ఉండేవి కాదు.

2014 తర్వాత: కేసీఆర్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకొని చైన్ స్నాచింగ్‌లు అన్నవే లేకుండా చేసింది. చీమ చిటుక్కుమన్నా పోలీసులకు తెలిసేలా నగరవ్యాప్తంగా 8 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. దేశంలోని మొత్తం సీసీటీవీ కెమెరాల్లో తెలంగాణ వాటా 64 శాతం (10 లక్షల సీసీటీవీలు).

ఫిర్యాదుల పరిష్కారం

2014 కు ముందు: సమస్య గురించి చెప్పాలంటే గతంలో పోలీసుస్టేషన్ గడప తొక్కాల్సిందే. మిస్సింగ్ సర్టిఫికెట్లు కావాలన్నా రోజుల తరబడి వేచి చూస్తూ.. స్టేషన్ చుట్టూ తిరగాల్సిందే.

2014 తర్వాత: డయల్ 100 ద్వారా గరిష్ఠంగా 5 నిమిషాల్లో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొంటున్నారు. 'హాక్ఐ' ద్వారా పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తున్నది. లాస్ట్ రిపోర్ట్ యాప్ ద్వారా 72 గంటల్లోనే మిస్సింగ్ సర్టిఫికెట్లపై స్పందిస్తున్నారు.

మహిళల రక్షణ

2014 కు ముందు: ఈవ్‌టీజింగ్, దొంగతనాలు, వేధింపులతో కాంగ్రెస్‌పాలనలో మహిళలు అరిగోస పడేవారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లలేక, ఆకతాయిల వేధింపులు భరించలేక ఉద్యోగాలు, ఉన్నత చదువులకు స్వస్తిపలికే దుస్థితి ఉండేది.

2014 తర్వాత: షీటీమ్స్, భరోసా, సఖి, డయల్ 100 ద్వారా మహిళలకు ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణ లభించింది. 'మైక్యాబ్', 'ఆటో ఈజ్ సేఫ్', షీ-షటిల్స్ వంటివాటితో మహిళలకు భద్రతతో కూడిన ప్రయాణం లభిస్తున్నది.

నేరాలు-ఘోరాలు

2014 కు ముందు: నగరంలో పేకాట క్లబ్బులు, గుడుంబా విక్రయాలు, మట్కా, జూదం, రౌడీయిజం, గూండాయిజం వంటివి కొనసాగేవి. జూదంలో డబ్బులు పోగొట్టుకొని ఎన్నో కుటుంబాలు రోడ్డునపడేవి. రెండేండ్ల కోసారి ఉగ్రదాడి ఘటనలతో నగరం ఉలిక్కిపడేది.

2014 తర్వాత: వ్యవస్థీకృత నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పేకాట క్లబ్బులను ప్రభుత్వం నిషేధించింది. గుడుంబా విక్రయాలను పూర్తిగా అడ్డుకొని, దానిపై ఆధారపడిన వారికి జీవనోపాధి కల్పించింది. రౌడీలు, గూండాల బెడద లేకుండా చేసింది. డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం మోపింది. ఉగ్రదాడులు జరుగకుండా పటిష్ఠ నిఘాను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

బెంగళూరులో మహిళలకు భద్రత లేదు

నా భార్యను కొందరు దుండగులు వెంబడించారు. వాహనాలతో ఆమె కారును ఢీకొట్టి కిందకు దిగాలని ఒత్తిడి చేశారు. ఈ తతంగాన్ని వందల మంది చూసినా ఏ ఒక్కరూ అడ్డుకోలేదు. బెంగళూరులో మహిళలకు భద్రత కరువైంది.
-కాంగ్రెస్ పాలిత కర్ణాటకకు చెందిన బాధితురాలి భర్త ఆవేదన ఇది

రక్షణలో హైదరాబాద్ భేష్

నిమజ్జనం చూసేందుకు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాం. పోకిరీల బెడద ఉంటుందని భయపడ్డాం. అయితే, షీ టీమ్స్ ప్రత్యేక నిఘాపెట్టి 255 మంది ఆకతాయిలను అరెస్టు చేసిందని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నాం. థాంక్యూ.. తెలంగాణ పోలీస్.
– గణేశ్ నిమజ్జనం సందర్భంగా డిగ్రీ కాలేజీ విద్యార్థినుల ప్రశంస ఇది

కాంగ్రెస్ పాలనలో భయానక రోజులు గుర్తున్నాయా?

ఎక్కడ చూసినా కర్ఫ్యూలు, మత కల్లోలాలు, దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, అరాచకాలు నిఘా వైఫల్యంతో లుంబినీ పార్కు, గోకుల్ చాట్, మక్కా మసీద్ వద్ద పేలుళ్లు. కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు పోకిరీల వేధింపులు.. మార్నింగ్ వాక్‌లకు వెళ్తే మహిళలపై చైన్ స్నాచర్ల దాడులు.. కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో శాంతి భద్రతలు ఎలాగున్నాయో చెప్పడానికి ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరాక తెలంగాణ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకొంటున్నది. అల్లర్లనేవే లేవు. అయితే, ఇప్పుడు ఒక అవకాశమివ్వాలని మళ్లీ కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారు. ఆదమరిచి పొరపాటు నిర్ణయం తీసుకొన్నామో.. అప్పటి చీకటి, కల్లోల, దోపిడీ రోజులు మళ్లీ తెలంగాణలో నిత్యకృత్యంగా మారుతాయి. జాగ్రత్త!



కరెంట్‌పై కర్ణాటక మంత్రి 'కోతలు'!

- 24 గంటల కరెంటు కాంగ్రెస్ పుణ్యమట!
- కర్ణాటక మంత్రి కేజే జార్జ్ బడాయి
- అదే నిజమైతే కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు ఎందుకున్నాయని నిలదీస్తున్న విద్యుత్తురంగ నిపుణులు
- విద్యుత్తురంగం బలోపేతానికి 40 వేల కోట్లు వెచ్చించిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కట్టుకథలు చెప్పడంలో, ప్రజలను మభ్యపెట్టడంలో తాము సిద్ధహస్తులమని కర్ణాటక కాంగ్రెస్ నేతలు మరోసారి నిరూపించుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కర్ణాటక విద్యుత్తు శాఖ మంత్రి కేజే జార్జ్ నోటికొచ్చిన కట్టు కథలన్నీ చెప్పారు. తెలంగాణలో 24 గంటల కరెంటు గత కాంగ్రెస్ ప్రభుత్వమేనంటూ బడాయి మాటలు చెప్పుకొచ్చారు. జార్జ్ వ్యాఖ్యలపై తెలంగాణవాదులు, విద్యుత్తు రంగ నిపుణులు మండిపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి పదేండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే 24 గంటల కరెంటు సరఫరాకు కృషి చేసి ఉంటే.. కనీసం ఏడు గంటల కరెంటు కూడా ఎందుకు ఇవ్వలేకపోయారని, నిత్యం విద్యుత్తు కోతలు, కటిక చీకట్లు ఎందుకు ఉండేవని నిలదీస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు ఉండేదని, అయినా గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 5,661 మెగావాట్లకు మించి ఎందుకు సరఫరా చేయలేకపోయారని ప్రశ్నిస్తున్నారు. నాడు కనీసం 6 వేల మెగావాట్లు కూడా సరఫరా చేయలేని స్థితిలో విద్యుత్తు సరఫరా వ్యవస్థ ఎందుకు కొట్టుమిట్టాడిందని నిలదీస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వాలకు లేకపోవడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన బాధ్యతలు స్వీకరించిన వెంటనే విద్యుత్తురంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, దానిని బలోపేతం చేయడానికి కృషి చేశారని విద్యుత్తురంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్తును అందించడానికి కావాల్సిన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు మౌలిక వసతులు కల్పించారని ఉదహరిస్తున్నారు. విద్యుత్తురంగంలో మౌలిక వసతుల కల్పన, బలోపేతానికి సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని వివరిస్తున్నారు. ఫలితంగా గరిష్ఠ డిమాండ్ దాదాపు మూడు రెట్లు పెరిగి, 15,497 మెగావాట్లకు చేరుకున్నదని చెప్తున్నారు. కాంగ్రెస్ కాలంలో దుస్థితిని.. ఇప్పుడున్న పరిస్థితిని లెక్కలతో సహా వివరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో 400 కేవీ సబ్‌స్టేషన్లు ఆరు మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ పరిపాలనలో వాటి సంఖ్య 27కు పెరిగిందని గుర్తుచేస్తున్నారు. 220 కేవీ సబ్ స్టేషన్ల సంఖ్యను 51 నుంచి 103కు, 132 కేవీ సబ్‌స్టేషన్లను 176 నుంచి 252కు పెంచారని వివరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు విద్యుత్తు లైన్ల పొడవు 4.89 లక్షల కిలోమీటర్లు ఉండగా.. కేసీఆర్ పరిపాలనలో విద్యుత్తు లైన్ల పొడవు 6.78 లక్షల కిలోమీటర్లకు పెరిగింది.

పదేండ్లలో వసతుల కల్పన ఇలా..

వసతులు	2014లో	2023 నాటికి
400 కేవీ సబ్ స్టేషన్లు	6	27
220 కేవీ సబ్ స్టేషన్లు	51	103
132 కేవీ సబ్ స్టేషన్లు	176	252
ఈహెచ్‌టీ సబ్ స్టేషన్లు	233	382
33 కేవీ సబ్ స్టేషన్లు	2,138	3,212
ఈహెచ్‌టీ లైన్లు (సర్క్యూట్ కి.మీల్లో)	16,379	28,356
ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం (ఎంవీఏ)	14,973	40,640
విద్యుత్తు లైన్ల పొడవు (లక్షల కి.మీల్లో)	4.89	6.78

గచ్చిబౌలిలో 5 కోట్లు పట్టివేత

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో గురువారం భారీమొత్తంలో నగదు పట్టుబడింది. ఒక వ్యాపారి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.5 కోట్లను గచ్చిబౌలి పోలీసులు సీజ్ చేశారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ చిరెక్ పబ్లిక్ స్కూల్ రహదారిపై వెళ్తున్న టీఎస్02 ఈవై2678 నంబర్ మారుతి బ్రీజా కారును సోదా చేయడంతో రెండు బ్యాగుల్లో ఈ డబ్బు పట్టుబడినట్టు నట్టు ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు వెల్లడించారు. ఎలాంటి ఆధారాల్లేకుండా తరలిస్తున్న ఆ సొమ్మును ఐటీ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు. ఆ డబ్బును తరలిస్తున్న పెద్దపల్లి జిల్లా శివపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త దుగ్యాల సంతోష్‌రావు (36)తోపాటు తుర్కల మడ్డికుంట గ్రామానికి చెందిన ముత్యాల నరేశ్ (36), సుల్తానాబాద్ కట్నపల్లికి చెందిన చీతి సంపత్‌రావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు వివరించారు.

హైదరాబాద్‌లో పట్టుబడిన నగదు

కాంగ్రెస్‌తో మైనార్టీలకు కష్టాలే

- 50 ఏండ్ల పాలనలో చేసిందేమీలేదు
- హుస్నాబాద్, మానకొండూరు పర్యటనలో మహమూద్ అలీ

మానకొండూర్/హుస్నాబాద్, నవంబర్ 23: కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు విని ఓటేస్తే ముస్లిం మైనార్టీలకు కష్టాలు మళ్లీ మొదలవుతాయని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో మీడియాతో మాట్లాడారు. అనంతరం గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి నియోజకవర్గ స్థాయి ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. 2014కు ముందు ముస్లింలను పట్టించుకున్నవారే లేరని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటున్నారని తెలిపారు. బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీలకుప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ముస్లిం పిల్లలు చదువుకునే అవకాశం లేక హోటళ్లలో పనిచేసేవారని, సీఎం కేసీఆర్ మైనార్టీ గురుకుల పాఠశాలలను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. షాదీముబారక్ పథకం పేద ముస్లింలకు ఎంతో ఉపయోగపడుతున్నదని, విదేశాలకు వెళ్లే ముస్లిం విద్యార్థులకు ఓవర్సీస్ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. ముస్లింల రిజర్వేషన్ కోసం జీవో జారీ చేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో మతఘర్షణలు జరిగేవని తరచూ కర్ఫ్యూలు విధించే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనతో రాష్ట్రంలో మతఘర్షణలు, కర్ఫ్యూలు మచ్చుకైనా లేవని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ ఆదరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మహమూద్‌అలీ

ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్, బీజేపీ విషప్రచారం

- 1.60 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- 55 వేల పోస్టుల భర్తీకి కోడ్ అడ్డంకి
- ఓయూ, శాతవాహన విద్యార్థి జేఏసీ నేతలు భాస్కర్, చైతన్య

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 23: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్, బీజేపీ విషప్రచారం చేస్తున్నాయని ఓయూ, శాతవాహన విశ్వవిద్యాలయాల విద్యార్థి జేఏసీ నాయకులు భాస్కర్, చైతన్య విమర్శించారు. జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా జగిత్యాలలో ఓయూ, ఎస్‌యూ జేఏసీ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్న రేండ్లలో 1.60 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని అన్నారు. 47 వేల పోలీసు ఉద్యోగాలు, టీఎస్‌పీఎస్సీ ద్వారా 35 వేలు, గురుకుల విద్యాసంస్థల్లో 3,600 ఉద్యోగాలు, ఇతర రిక్రూట్‌మెంట్ల ద్వారా 41 వేల ఉద్యోగాలను ఇదివరకే భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మరో 55 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయగా, ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందని అన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే నియామక ప్రక్రియను భర్తీ చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 1,001 గురుకులాలను కొత్తగా ఏర్పాటు చేయగా, వీటిల్లో 6.50 లక్షల మంది పేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో విద్య అందిస్తున్నదని చెప్పారు. మళ్లీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలండర్ ప్రకటిస్తామని మంత్రి కేటీఆర్ చెప్పడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఏ ఒక్క ఉద్యమ నాయకుడినైనా గుర్తించిందా? ఏ ఒక్క ఉద్యమకారుడికైనా ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లిచ్చారా? అని ప్రశ్నించారు. ఉద్యమంలో పాల్గొన్న నాయకులను కేసీఆర్ గుర్తించి ఎంపీ, ఎమ్మెల్యేలను చేశారని చెప్పారు.

జగిత్యాలలో మాట్లాడుతున్న ఓయూ, శాతవాహన వర్సిటీ జేఏసీ, బీఆర్ఎస్వీ నాయకులు